www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం బుధవారం 08.01.2025

## నిర్మల్ ప్రజలకు కేంద్రం తీపికబురు



### కేంద్ర రైల్వే శాఖామంత్రిని కలిసిన ఏలేటి

- ఆర్మూర్–నిర్మల్ –ఆదిలాబాద్ రైల్వేలైన్ పై చర్చ
- నిర్మల్ రైల్వేలైన్ పై ఏర్పాటుకు సుముఖత

కలం జ్యోతి, నిర్మల్ : బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖామంత్రి మంత్రి అశ్విని వైష్ణవ్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన రైల్వేలైన్ విస్తరణ పనుల గురించి చర్చించారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా ప్రజల చిరకాల కోరిక ఆర్మూర్--ఆదిలాబాద్ వయా నిర్మల్ రైల్వేలైన్ ను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి రైల్వేలైన్ కు సంబంధించి హామీ ఇచ్చారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని వైష్ణవ్ చెప్పినట్లు ఏలేటి పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి బీజేపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



## డీపీఆర్‌లు త్వరగా పూర్తి చేయండి

### సీఎం రేవంత్ రెడ్డి

- మార్చి నెలాఖరుకు 'మెట్రో'ల డీపీఆర్ నివేదిక ఇవ్వాలి
- శామీర్ పేట్-మేడ్చల్ మెట్రోల ప్రారంభంలో భారీ జంక్షన్ ఏర్పాటు
- హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం..
- మెట్రో, ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి

3 లో

### మాంజా విక్రయిస్తే చర్యలు

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

3 లో

## కేటీఆర్‌కు హైకోర్టు ఝలక్



### క్వాష్ పిటిషన్ కొట్టివేత

- 16న విచారణకు రావాలన్న ఈడీ
- సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమాలోచనలు
- సుప్రీంలో తెలంగాణ ప్రభుత్వం కేవియట్ పిటిషన్
- వేడెక్కిస్తున్న 'ఈ – ఫార్ములా' కేసు

కలంజ్యోతి, హైదరాబాద్ :

ఫార్ములా ఈ - కార్ రేసింగ్ కేసు వ్యవహారంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ, ఆసక్తి నింపాయి. ఈ కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం హైకోర్టు తిరస్కరించింది. కోర్టు తుది తీర్పును వెల్లడిస్తున్న క్రమంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేయకూడదని ఆయన తరుపు అడ్వొకేట్ కొరగా.. ఇలాంటి పిటిషన్లలో అవన్నీ కుదరవని బెంచ్ స్పష్టం

మిగతా 2లో

కలంజ్యోతి
బుధవారం 08.01.2025



# కేటీఆర్‌కు జైలు ఖాయం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## ఆయన మాటలను కోర్టు విశ్వసించలేదు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనపై ఏసీబీ నమోదు చేసిన నిరాధారమైన కేసులను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటీషన్ ను హైకోర్టు కొట్టివేయడం దానికి బలాన్ని చేకూరుస్తుందన్నారు. మంగళవారం జలసౌదాలో జరిగిన ఇరిగేషన్ సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ - కార్ రేస్ కేసులో అసలు అవినీతే జరగలేదని కేటీఆర్, బీఆర్ఎస పార్టీ చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చిందని వ్యాఖ్యానించారు. ఆయన మాటలను కోర్టు విశ్వసించలేదని చెప్పారు. మరోవైపు హైకోర్టు తీర్పుతో కేటీఆర కు అరెస్ట్ భయం పట్టుకుందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే కేసు పెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. రూ.55 కోట్లు విదేశీ కంపెనీలకు అప్పనంగా అప్పగించి దొరికిపోయి ఇంకా బుకాయిస్తున్నారని మండిపడ్డారు. తూపేల్ కేసు, లొట్టపీసు కేసు అన్న కేటీఆర్ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ విచారణకు హాజరుకావడానికి కూడా వణికిపోతున్నారన్నారు. లాయర్ లేకుండా ఏసీబీ ముందుకు వెళ్లలేక, ఆ అధికారుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పలాయన చిత్తగించాడని ఎద్దేవా చేశారు. కేటీఆర ఎన్ని వేషాలు వేసినా ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయాల్సిన కర్మ సీఎం రేవంత్ రెడ్డికి పట్టలేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను బరాబర్ అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా ఇస్తామని తేల్చి చెప్పామన్న ఉత్తమ్.. ఇచ్చిన మాట తప్పమన్నారు.

# కేటీఆర్‌కు హైకోర్టు ఝలక్

మొదటిపేజీ తరువాయి

చేసింది. తాము ఏసీబీని అరెస్ట్ చేయొద్దని చెప్ప లేమని స్పష్టం చేసింది. కేసు విషయంలో ఏసీబీ వాదనలను తాము సీరియస్‌గా పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది.

**16న విచారణ..**

హైకోర్టు క్వాష్ పిటిషన్ ను తిరస్కరించిన వెంటనే.. కేసు విచారణలో భాగంగా ఈ నెల 16న వ్యక్తిగతంగా విచారణకు రావాల్సిందేనంటూ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ (ఈడీ) కేటీఆర్ కు మరోసారి నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జనవరి 7న తమ ఎదుట హాజరుకావాలని ఈడీ ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసు ఇచ్చింది. మంగళవారం తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో తనకు సమయం ఇవ్వాలని ఈడీని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ మెయిల్ పంపారు. హైకోర్టుపై ఉన్న గౌరవంతో.. తీర్పు వచ్చేంత వరకు సమయం ఇవ్వాలని విన్నవించారు. అయితే కేటీఆర్ విజ్ఞప్తిపై ఈడీ అధికారులు స్పందించింది. విచారణకు మరో తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. మరోవైపు కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే ఈడీ కేటీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొంది.






**సుప్రీం కోర్టులో ప్రభుత్వం కేవియట్ పిటిషన్**

తెలంగాణ ఫార్ములా ఈ -రేసు కేసు గంటకో మలుపు తిరుగుతుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్ కు హైకోర్టులో చుక్కెదురు కాగా.. ఏసీబీ అధికారులు తమ విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో గ్రీన్ కో సంస్థలపై వరుస దాడులు చేసి సోదాలు నిర్వహించింది. అయితే ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు తన న్యాయవాదులతో చర్చిస్తున్న సమయంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఫార్ములాఈ -రేసు కేసుపై సుప్రీంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. అందులో ఒక వేళ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. తమ వాదనలు కూడా వినాలని ప్రభుత్వం తమ పిటిషన్‌లో కోరింది.

# భారత్‌లో 8 హెచ్ఎంపీవీ కేసులు

కలంజ్యోతి, న్యూ ఢిల్లీ : భారత్ లోనూ హెచ్ ఎంపీవీ కేసులో రోజురోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం ఉదయం చేసిన పరీక్షల్లో మరో ఇద్దరికి పాజిటివ్ గా తేలింది. మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో ఈ కేసులు నమోదయ్యాయి. 13 ఏళ్ల బాలిక, 7 ఏళ్ల బాలుడు ఈ వైరస్ బారినపడ్డారు. దాంతో వీరిద్దరిని క్వారైంటిన్ చేసి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే కర్నాటక, తమిళనాడులో రెండు, పశ్చిమ బెంగాల్, గుజరాత్ లలో రెండు చొప్పున ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ సోకిన వారంతా చిన్నారులే కావడం గమనార్హం. అయితే ఇదే అంశంపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. నిత్యం పరిస్థితులను సమీక్షిస్తున్నామన్నారు. ఈ వైరస్ బారిన పడిన వారికి భయాందోళనలు అవసరం లేదన్నారు. ఈ వైరస్ సాధారణమైనదేనని అయినా జాగ్రత్తలు తప్పనిసరన్నారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఇన్ఫెక్షన్ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇప్పటికే ఈ దేశంలో ఈ వైరస్ బారిన పడిన వారు ఎనిమిది మందిగా గుర్తించారు.



## మరో 2 రోజుల వరకు

# ఇదే వాతావరణం

**కలంజ్యోతి ప్రతినిధి :** రాష్ట్రంలో చలివాతావరణం కొనసాగుతున్నది. రాబోయే మరో రెండు రోజుల వరకు కూడా ఇదేవాతావరణం ఉంటుందని కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని, ఆ తర్వాత రెండు రోజుల్లో సాధారణం కంటే 2 డిగ్రీల నుండి 3 డిగ్రీల సెల్సియస్‌వరకు తక్కువగా ఉండే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని, రాబోయే 3 రోజులు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది



## టీయూటీఎఫ్ క్యాలెండర్

# ఆవిష్కరించిన ఏలేటి

**కలంజ్యోతి, నిర్మల్ :** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) నిర్మల్ జిల్లా 2025 సంవత్సర క్యాలెండర్, డైరీలను నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.మురళి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్ ఖాన్, కోశాధికారి మేడారం శ్రీనివాస్, నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, శరత్చంద్రరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి గంగాధర్, పోల ధర్మరాజ్, ద్రుపత్ రెడ్డి, నరేష్, మతీన్, వీర్భాపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి 3
బుధవారం 08.01.2025

# డీపీఆర్‌లు త్వరగా పూర్తి చేయండి

## సీఎం రేవంత్‌రెడ్డి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్‌లు) మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం - ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్ - శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్ - మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని.. అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




# ఇదే నా చివరి మీడియా సమావేశం

## ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్‌కుమార్

**కలంజ్యోతి, న్యూ ఢిల్లీ :** ఎన్నికల కమిషనర్ గా ఇదే తన చివరి మీడియా సమావేశమని సీఈసీ రాజీవ్ కుమార్ మంగళవారం అన్నారు. ఢిల్లీ ఎన్నికల తేదీలను ప్రకటించి మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2020 సెప్టెంబర్ 1 నుంచి ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు. 1960 ఫిబ్రవరి 19న జన్మించిన రాజీవ్ కుమార్ 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 36 సంవత్సరాలపాటు పలు అనేక మంత్రిత్వ శాఖల్లో పలు కీలక బాధ్యతలను చేపట్టి విజయవంతంగా నిర్వహించారు. సామాజిక, పర్యావరణ, అటవీ, మానవ వనరులు, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల్లో కూడా పనిచేశారు. కొవిడ్ ఇన్ఫెక్షన్ సమయంలో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. 2020లో కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈయన పదవీ కాలం 2025తో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు చేశారు.



# అనినాష్ కుటుంబానికి న్యాయం చేయాలి

## ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్

▶ హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణం

**కలంజ్యోతి, నర్సంపేట :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని జయముఖి కళాశాల ఎదుట ప్రైవేట్ హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ ఘాతానికి గురై జయముఖి కళాశాలకు చెందిన ఫార్మ్ -డీ చదువుతున్న నిర్మల్ జిల్లాకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి కొండేల్వాడి అవినాష్ రెడ్డి మృతి చెందాడు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్తులు నిర్వాహకులకుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట మార్చురీ ఎదుట ఏబీవీపీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లడుతూ.. యజమాన్యం నిర్లక్ష్యం వల్ల మృతిచెందిన అవినాష్ రెడ్డి కుటుంబ సభ్యులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ హాస్టల్ యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్న వార్డెన్ వివేక్ ను అరెస్టు చేసి హాస్టల్ ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రాకం రాకేష్, కార్యకర్తలు, శశి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాంజా విక్రయిస్తే చర్యలు

## నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల


**కలంజ్యోతి, నిర్మల్ :** రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇప్పటికే గాలిపటాలకు సంబంధించిన సామగ్రి ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీ లు చేపట్టామన్నారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలు పర్యవరణానికి విపత్తుగా మారాయన్నారు. అలాగే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. విక్రయించిన మాంజాతో ఎదైనా ప్రమాదం జరిగినట్లయితే విక్రయదారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజా నిలువచేసినా, అమ్మిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు. అలాగే ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.





# ‘సికందర్’ ఫైనల్ షెడ్యూల్‌కు
# ముహూర్తం ఫిక్స్..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నది. తెలుగు, హిందీ అని భాషతో సంబంధం లేకుండా స్టార్ హీరోల చిత్రాల్లో అవకాశాలు అందుకుంటున్నది.ఈ అమ్మడు ఇటీవల ‘పుష్ప-2’ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ సాధించింది. ప్రస్తుతం రష్మిక బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ సరసన ‘సికందర్’ మూవీలో హీరోయిన్‌గా నటిస్తుంది. అయితే ఈ సినిమాకు మురుగదాస్ దర్శకత్వం వహిస్తుండగా.. దీనిని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఇందులో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుంది. అయితే ఈ చిత్రం ఈద్ సందర్భంగా మార్చిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల ‘సికందర్’ టీజర్ కూడా విడుదలై మంచి రెస్పాన్స్‌ను దక్కించుకుంది. ఈ క్రమంలో.. తాజాగా, ‘సికందర్’ మూవీ ఫైనల్ షెడ్యూల్ జనవరి 10న ముంబాయిలో జరగనున్నట్లు సమాచారం. ఇందులో సల్మాన్, రష్మిక మధ్యలోని కొన్ని సీన్స్ షూట్ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




Cinema
కలంజ్యోతి
బుధవారం 08.01.2025